క్లుప్తంగా

శాంతికి భంగం కలిగిస్తే కేసులు తప్పవు

సీఐ జయకుమార్

కారెంపూడి: నూతన సంవత్సర వేడుకలు ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని అశాంతిని సృష్టించే ఏ విధమైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడ్డా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కారెంపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దార్ల జయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో, రోడ్లపై మద్యం తాగడం, మద్యం సేవించి వాహనాలు నడపడం చేయవద్దన్నారు. పటిష్టమైన పోలీస్ నిఘా ఏర్పాటు చేస్తామని అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించి కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం సేవించి అతివేగంగా వాహనాలు నడపడం, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రశాంతంగా వేడుకలు జరుపుకోవాలని రెంటచింతల, దుర్గి, కారెంపూడి మండలాల ప్రజలకు సీఐ జయకుమార్ విజ్ఞప్తి చేశారు.

మండలంలో రెండోరోజు కళ్లజోళ్ల పంపిణీ



కారెంపూడి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలలో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లజోళ్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం కూడా కొనసాగింది. చింతపల్లి గ్రామంలో వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా పార్టీ కార్యదర్శి పంగులూరి రామకృష్ణయ్య చేతుల మీదుగా వైద్య ఆరోగ్య సిబ్బంది లబ్ధిదారులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. అలాగే వివిధ గ్రామాలలో ప్రజా ప్రతినిధులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది కళ్లజోళ్లు పంపిణీ చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలలో ఉచిత కంటి పరీక్షలు చేయడంతో పాటు నేడు కళ్లజోళ్లు కూడా ఉచితంగా పంపిణీ చేస్తున్నందుకు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీఎన్‌జీవో క్యాలెండర్ ఆవిష్కరణ



పిడుగురాళ్ల: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీవో కాశయ్య ఏపీఎన్‌జీవో 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు మరింతగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీవో యూనిట్ ప్రెసిడెంట్ పట్టాభి, పంచాయతీ కార్యదర్శులు, ఏపీఎన్‌జీవో సంఘం సభ్యులు తదితరులున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ బడ్జెట్ సమావేశం

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్ హాల్‌లో బడ్జెట్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తెలిపారు. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహించటం జరుగుతుందని ప్రతి కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని ఆయన తెలియజేశారు.

దిశ యాప్ సద్వినియోగం చేసుకోండి



దాచేపల్లి : మహిళలు, బాలికలు దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ సంధ్యారాణి అన్నారు. స్థానిక స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. విద్యార్థులకు దిశ చట్టం, యాప్‌పై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు ఆపదలో ఉన్న సమయంలో దిశ యాప్ ద్వారా సమాచారం అందిస్తే తక్షణమే పోలీసుల నుంచి రక్షణ లభిస్తుందని, వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం వాటిల్లితే దీనిని ఉపయోగించాలని చెప్పారు. రక్తసంబంధీకులు తప్ప ఇతరులు ఎవరు పిలిచినా వెళ్లవద్దని, గుర్తు తెలియని వ్యక్తులు ఇచ్చే ఆహారపదార్థాలు తినవద్దని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ దాసరి శివనాగరాజు, ఏఎస్ఐ కృష్ణారావు తదితరులున్నారు.

అక్రమ మద్యం సీసాలు పట్టివేత

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి నుంచి 20 అక్రమ తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం గ్రామానికి చెందిన యలగాల వీరనారాయణ గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే విశ్వసనీయ సమాచరం మేరకు తనిఖీలు చేపట్టగా ఇంట్లో గుట్టుగా దాచి ఉంచిన తెలంగాణ మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రతిభను వెలికి తీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా'

విజయపురిసౌత్: క్రీడాకారులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. శుక్రవారం మాచర్ల మండలంలోని విజయపురిసౌత్, నాగులవరం, చింతలతండా సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులు నైపుణ్యం ప్రదర్శించేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విజయపురిసౌత్‌లోని జింఖానా గ్రౌండ్‌లో పీవీఆర్ క్రీడా పోటీలు ప్రారంభించి క్రికెట్ ఆడారు. అనంతరం క్రీడాకారులకు కిట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మండల స్పెషల్ ఆఫీసర్ గబ్రూనాయక్, ఎంపీడీవో సరోజినిదేవి, మండల పార్టీ నాయకుడు బూడిద శ్రీనివాసరావు, సర్పంచ్ గోగిరెడ్డి వెంకట్రావమ్మ వెంకటేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి దస్తగిరి, సచివాలయం సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.



విజయపురిసౌత్‌లోని జింఖానా గ్రౌండ్‌లో క్రికెట్ ఆడుతున్న పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి చౌడేశ్వరి



క్రీడాకారులకు కిట్లను అందజేస్తున్న పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీటీసీ బొంత కృష్ణ, సెక్రటరీ వెంకటరెడ్డి

ఆడుదాం ఆంధ్రాతో ఉజ్వల భవిష్యత్

రెంటచింతల: మారుమూల గ్రామీణ ప్రాంతాలలోని యువతలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి వారికి ఉజ్వల భవిష్యత్తును కల్పించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించినట్లు ఎంపీపీ దాసరి చౌడేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో మండలంలోని పశర్లపాడు, తుమృకోట గ్రామాలకు చెందిన యువకులకు నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాలికలకు నిర్వహించిన ఖోఖో, కబడ్డీ పోటీలను ఆమె డీడీఓ, మండల ప్రత్యేక అధికారి యార్ల మహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పల్లె ప్రాంతాలలో ప్రోత్సాహం లేక వెలుగులోకి రాని ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రపంచానికి పరిచయం చేయడానికి సీఎం జగన్ ఈ కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు. యువత ఎంతో ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొంటున్నట్లు చెప్పారు. నిర్వహించిన పోటీలలో గెలుపొందిన జట్లు మండల స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పీఈటీ కత్తి రవి తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్ల ముత్తయ్య, కార్యదర్శులు, పీఈటీలు బ్రహ్మం, కళ్యాణి, సుభాని, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉత్సాహంగా సాగుతున్న ఆడుదాం ఆంధ్రా

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం మండల పరిధిలోని వివిధ సచివాలయాలలో ఉత్సాహంగా సాగుతుంది. శుక్రవారం ముటుకూరు-2లో వాలీబాల్, కంచరగుంట ఎంపీటీసీ బొంత కృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ వినూత్నంగా క్రీడలను విద్యార్థులకు చేరువచేసి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే విధంగా కార్యక్రమాలు నిర్వహించటం సంతోషకరమన్నారు. సెక్రటరీ వెంకటరెడ్డి పోటీల తీరును గమనించారు. మూడు జట్లలో మంగాపురం తండాకు చెందిన కెప్టెన్ జీవన్ నాయక్ జట్టు ఫైనల్‌కు చేరింది. దుర్గి జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన క్రీడలు ఆసక్తిగా కొనసాగాయి. అడిగొప్పల, ముటుకూరు, ఓబులేశునిపల్లె, ధర్మవరం, తేరాల, ఆత్మకూరుల సచివాలయ పరిధిలో 11 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ క్రీడల పట్ల క్రీడాకారులు అధిక సంఖ్యలో రిజిస్ట్రేషన్లు నమోదు చేశారన్నారు. పీఈటీలు, సెక్రటరీలు పోటీల తీరును పర్యవేక్షించి గెలిచిన జట్ల వివరాలను వెంటనే యాప్‌లో నమోదు చేస్తున్నట్లు ఎంపీడీఓ కె సమతా వాణి పేర్కొన్నారు. పోటీల్లో స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాదాసు వాసు, సచివాలయ కన్వీనర్ బీర్నిడి దానయ్య, బొంత గాంధీ, మాదాసు సీతారామయ్య, విజయ్, పలువురు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత వైద్యం అందించండి

ప్రభుత్వ విప్ పీఆర్కే

మాచర్ల: రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతంలో వైద్య సేవలందించే వారిని ప్రోత్సహించేందుకు నాడు స్వర్గీయ రాజశేఖర్‌రెడ్డి, నేడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ప్రభుత్వాసుపత్రి వెనుక భాగంలో నూతనంగా నిర్మించిన వైద్యశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన పలువురు ఆర్ఎంపీ, పీఎంపీలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక వైద్యుడు పేదలకు ఉపయోగపడేలా వైద్య సేవలను ఆరోగ్య శ్రీ కింద అందించాలన్నారు. ఎక్కడా రాజీ పడకుండా పేదలకు వైద్య సేవలందించాలన్నారు. వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో వైద్యులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. ఆయన రిబ్బన్ కట్ చేసి ఆసుపత్రిలో పనిముట్లను పరిశీలించారు. అనంతరం సాగర్ రింగు రోడ్డులో ఆర్ఎంపీ, ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును వైభవ్ రెసిడెన్సీలో నిర్వహించారు.



నూతనంగా నిర్మాణమైన ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

డాక్టర్ రామచంద్రమూర్తి, అరుణ్‌కుమార్, గార్లపాటి కృష్ణకాంత్, జ్ఞానేశ్వరి, బాలకృష్ణ నవులూరి రామకృష్ణ, కేపీ చారి, ఎండీ కటకం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించి వైద్య రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల గురించి వివరించారు. గ్రామీణ ప్రాంతంలో ఆర్ఎంపీలు మంచి సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ సంఘ నాయకులు సిద్దయ్య చారి, రాజు, శివ పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించండి

మున్సిపల్ కమిషనర్ రమణబాబు

మాచర్ల: పట్టణంలో ప్రతి ఒక్కరూ డిసెంబర్ 31వ తేదీలోపు అపరాధ రుసుం లేకుండా ఆస్తి, నీటి పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పాత బకాయిలతో పాటు పూర్తి స్థాయి బకాయిలు చెల్లించాలన్నారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 31వ తేదీలోపు పన్నులు చెల్లించాలన్నారు. పాత బకాయిలున్న వారు అపరాధ రుసుం చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

డిసెంబర్ 31న సంబరంగా జరుపుకోండి



మాచర్ల: పట్టణంలో డిసెంబర్ 31న నూతన సంవత్సర వేడుకలు జరిపే వారు ఎటువంటి వివాదాలకు పోకుండా పోలీసులకు సహకరించి ఆనందంగా జరుపుకోవాలని అర్బన్ సీఐ శరత్ బాబు అన్నారు. శుక్రవారం ఆయన పట్టణ పోలీసుస్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ అర్ధరాత్రి తరువాత ఎవ్వరూ ఎటువంటి వివాదాలకు తావులేకుండా కార్యక్రమాలను జరుపుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా, ఆనందంగా నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాలని, ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

యూత్ అధ్యక్షుడికి అభినందనలు



మాచర్ల: పట్టణ వైఎస్సార్‌సీపీ నూతన యూత్ అధ్యక్షుడిగా ఎంపికైన షేక్ మస్తాన్‌కు పలువురు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన షేక్ మస్తాన్‌ను పలువురు మైనార్టీలు అభినందించారు. ఈ కార్యక్రమంలో షేక్ సులేమాన్, చినబద్రు, కౌన్సిలర్లు షేక్ మస్తాన్, దస్తగిరి, రహ్మాన్ పాల్గొన్నారు.

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

పెదకూరపాడు: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం డైరీ, క్యాలెండర్, స్టిక్కర్, పాకెట్ క్యాలెండర్‌లను మండల సంఘం అధ్యక్షుడు రాయపూడి సాంబశివరావు అధ్యక్షతన శుక్రవారం పెదకూరపాడులోని జిల్లా పరిషత్ పాఠశాలలో మండల విద్యా శాఖ అధికారులు ఏకుల ప్రసాదరావు, సత్యనారాయణలు ఆవిష్కరించారు.

చెన్నకేశవుని చెంతకు అయోధ్య అక్షింతల కలశం



అక్షింతల ప్యాకెట్లు సిద్ధం చేస్తున్న మహిళా భక్తులు

కారెంపూడి: స్థానిక చెన్నకేశవస్వామి ఆలయంలో శ్రీరామ జన్మభూమి భవ్య మందిర ప్రతిష్ట సందర్భంగా 25 వేల ప్యాకెట్ల అక్షింతలు మహిళా భక్తులు శుక్రవారం సిద్ధం చేశారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతల కలశాన్ని ఆలయ పూజారి సత్యనారాయణాచార్యులకు అందించారు. అక్షింతలకు ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించిన అనంతరం మహిళా భక్తులు అక్షింతల ప్యాకెట్లను సిద్ధం చేశారు. ఇదిలా ఉంటే శ్రీరాముని భవ్య మందిర ప్రతిష్ట గురించి తెలుపుటకు గ్రామంలో మంగళవారం ఉదయం 10 గంటలకు శోభాయాత్ర జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

అసత్య ప్రచారాలను నమ్మొద్దు

- విధేయతతో, బాధ్యతాయుతంగా సేవలు అందిస్తున్నా
- పచ్చ మీడియా చేసే విషప్రచార ట్రాప్‌లో పడొద్దు
- నన్ను ఓడించటమే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ లక్ష్యం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకుడు



వైఎస్సార్‌సీపీలో చేరిన శివకోటేశ్వరరావుకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: నాపై పని కట్టుకొని ఈనాడు, ఆంధ్రజ్యోతి, ఏబీఎన్, టీవీ 5, మరి కొంతమంది అసత్య, విష ప్రచారాలు చేస్తున్నారని పచ్చ మీడియా ట్రాప్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పడవద్దని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ నాయకుడు, 13వ వార్డు ప్రెసిడెంట్ గంటా శివకోటేశ్వరరావు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో శుక్రవారం చేరారు. ఆయనకు మంత్రి అంబటి రాంబాబు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. మంత్రి అంబటి మాట్లాడుతూ గంటా శివకోటేశ్వరరావు టీడీపీ ఆవిర్భావం నుంచి ఆ పార్టీకి సేవలు అందిస్తున్నాడన్నారు. ఆ పార్టీ వ్యవహరిస్తున్న తీరు, విధానాలు నచ్చక వైఎస్సార్‌సీపీలో చేరేందుకు ముందుకు వచ్చాడన్నారు. నియోజకవర్గంలో విధేయతతో, బాధ్యతాయుతంగా సేవలు అందిస్తున్నానన్నారు. ఏదో రకంగా విషం చిమ్మాలనే ఉద్దేశంతో పచ్చమీడియా పని చేస్తోందని, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కూడా తనను ఓడించటమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. మన అధినేత జగన్‌మోహన్ రెడ్డి నేరుగా ప్రకటించే వరకు మన పని మనం చేసుకుందామని, అలా కాకుండా మాట్లాడితే అధినేతను ధిక్కరించిన వారమవుతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీనే మళ్లీ అధికారంలోకి వస్తుందని, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని అనేక సర్వేలు చెబుతున్నాయన్నారు. గంటా శివకోటేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించి పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులను కలుపుకొని పని చేయాలన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, సాంబశివరావు, వైస్ చైర్మన్‌లు షేక్ నాగుర్‌మీరాన్, రమావత్ కోటేశ్వరరావునాయక్, ఏఎంసీ చైర్మన్ పెండెం బాబూరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, పార్టీ నాయకులు అచ్యుత శివప్రసాద్, మల్లికార్జున రెడ్డి, వెంకటేశ్వర్లు, మాధవ, తిరుములరావు, ఏసుబాబు, శరత్‌బాబు తదితరులున్నారు.

108 వాహనానికి పార్కింగ్ సౌకర్యం కల్పించండి

సత్తెనపల్లి: పట్టణంలో 108 వాహనానికి పార్కింగ్, సిబ్బందికి వెయిటింగ్ రూమ్ కేటాయించేలా చూడాలని 108 వాహన చోదకుడు కిరణ్ కోరారు. శుక్రవారం ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ, సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావులకు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుంచి 108 వాహనాన్ని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పార్కింగ్ చేసి అక్కడి వెయిటింగ్ రూమ్ వాడుకుంటున్నామన్నారు. ప్రస్తుతం ఆ రూమ్ శిథిలావస్థకు చేరిందన్నారు. వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ 108 వాహనం ద్వారా విలువైన సేవలు అందిస్తున్నారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత త్వరగా ఏర్పాటు చేస్తామన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ 10 సంవత్సరాల క్రితం 108 సర్వీసులు ప్రైవేట్ వారి ఆధిపత్యంలో ఉండేవన్నారు. ప్రస్తుతం వాటిని ప్రభుత్వ పరిధిలోకి తీసుకుని వచ్చి విలువైన సేవలు నిరంతరం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో 108 సిబ్బంది, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, తదితరులున్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం



దేశవరం క్యాంప్ తండాలో విగ్రహ ప్రతిష్టా కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పీఆర్కే

విజయపురిసౌత్: స్థానిక దేశవరపు క్యాంప్ తండాలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ మాతా జగదాంబ, సేవాలాల్ మహారాజ్, అభయాంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ట మహోత్సవంలో ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం విలేకర్లతో మాట్లాడారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ మాతా జగదాంబ, సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని రూ.25 లక్షలతో నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. గిరిజన తండాల్లో అన్ని సౌకర్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతికి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవరం క్యాంప్ తండాలో వీధి దీపాలు, తాగు నీటి సమస్యపై స్థానికులు తనకు వివరించారని, సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాచర్ల జెడ్పీటీసీ మల్లుస్వామి, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి, మండల పార్టీ నాయకుడు బూడిద శ్రీను, ఆలయ కమిటీ చైర్మన్ రమావత్ హాతీరామ్‌నాయక్, మేఘావత్ కోదండరామ్‌నాయక్, రిటైర్డ్ డీఈ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు కారే మునలయ్య, శ్రీనివాసరావు, మేఘావత్ బాలాజీ, శ్రీనునాయక్, మోతీలాల్, దూప్‌సింగ్, చంద్రునాయక్, పూజారి సక్రూనాయక్, హుస్సేన్‌నాయక్, లక్ష్మీనారాయణ, మస్తాన్ పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన

మాచర్ల రూరల్: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈవీఎంల పనితీరులో ఎటువంటి అపోహలకు అనుమానాలకు లోనుకావద్దని తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్ కోరారు. శుక్రవారం మండలంలోని రాయవరం, జమ్మలమడక గ్రామాలలో ఈవీఎంలపై అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రజలతో మాట్లాడారు. ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించేందుకు డెమో కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రజలు తమ అనుమానాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. ఓటు వేయాల్సిన అభ్యర్థి ఫొటోకు ఎదురుగానే సింబల్ ఉంటుందని, సింబల్ నొక్కినప్పుడు 7 సెకన్ల పాటు ఉంటుందని, అలాగే ఓటర్ స్లిప్ కూడా వస్తుందని తెలిపారు. ప్రత్యేకంగా వృద్ధులు, కొత్తగా ఓటు హక్కు వచ్చిన వారు వీటిపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ షేక్ బాషా, ఏఎస్‌వో ప్రభాకర్, ఆర్ఐ ఎం.శ్రీనివాసరావు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ మస్తాన్‌వలి, వీఆర్‌వోలు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఈవీఎంల గురించి వివరిస్తున్న తహసీల్దార్ హుస్సేన్

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న టాటా మ్యాజిక్

ఒకరు మృతి, ఒకరికి గాయాలు

పిడుగురాళ్ల: ద్విచక్ర వాహనాన్ని టాటా మ్యాజిక్ వాహనం ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన పట్టణంలోని రియల్స్ పెట్రోల్ బంకు వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నకరికల్లు మండలం చేజర్ల గ్రామానికి చెందిన నింగిశెట్టి రామారావు తన తల్లి రత్తమ్మతో మాచవరం మండలంలోని పిల్లుట్ల గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో పెట్రోల్ బంక్ వద్ద వారి బైక్‌ను టాటా మ్యాజిక్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో రత్తమ్మ(80) అక్కడికక్కడే మృతి చెందగా రామారావుకు చిన్నపాటి గాయాలు అయ్యాయి. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఘటన స్థలంలో పడి ఉన్న ద్విచక్ర వాహనం, రత్తమ్మ మృతదేహం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

మెడికల్ ఆఫీసర్ కృష్ణారెడ్డి

రెంటచింతల: గ్రామాలలో నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇళ్లలో తాగిపడేసిన కొబ్బరి బొండాలు, వాహనాల టైర్లు నీటి తొట్లలో నిల్వ ఉన్న నీరు, నివాసాల ముందున్న సైడ్ కాల్వలలోని మురుగును ఎప్పటికప్పుడు తొలిగించి శుభ్రం చేసుకోవాలని ప్రజలకు వివరించాలన్నారు. మురుగు కాల్వలు వలన దోమలు ఉధృతంగా పెరుగుతాయని దీంతో వ్యాధులతో కలిసి ఉన్నట్లేనని హెచ్చరించాలన్నారు. దోమలను నివారించడంతో విషజ్వరాలైన డెంగీ, మలేరియా వంటి వ్యాధులు దరిచేరవని అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో మలేరియా హెల్త్ అసిస్టెంట్లు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ప్రజలను చైతన్యవంతులను చేయాలని సూచించారు. దోమ తెరలను వాడాలని తెలపాలన్నారు.

హుండీల లెక్కింపు.. ఆదాయం రూ.3.97 లక్షలు

రాజుపాలెం: మండలంలోని దేవరంపాడు కొండపై వేంచేసి ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలోని హుండీలను శుక్రవారం లెక్కించారు. దేవదాయ శాఖ పరిధిలో ఉన్న ఈ దేవస్థానంలో ప్రతీ మూడు నెలలకు ఒకసారి హుండీలను లెక్కిస్తారు. అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు గాను హుండీలను లెక్కించగా రూ.3,97,345 ఆదాయం వచ్చినట్లు ఈవో గుర్రం శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత ఏడాది ఇదే సమయంతో పోల్చుకుంటే రూ.65,502 ఎక్కువ వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, దేవరంపాడు సర్పంచ్ పత్తిపాటి దీనమ్మకోటేశ్వరరావు, దేవస్థానం కమిటీ చైర్మన్ అంబటి బ్రహ్మయ్య, శ్యామకూరి శ్రీనివాసరావు, పేటసన్నిగండ్ల దేవస్థానం ఈవో సైదమ్మబాయి, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.



నార్నెపాడులో ఈవీఎంలపై అవగాహన

నార్నెపాడు(ముప్పాళ్ళ): మండలంలోని నార్నెపాడు గ్రామంలోని పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లపై ఓటర్లకు అవగాహన కార్యక్రమం శుక్రవారం జరిగింది. తహసీల్దార్ ఎం.భవానిశంకర్ ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పనితీరును వివరించారు. ఓటు వేయగానే వీవీప్యాట్ నుంచి స్లిప్ బయటకు వస్తుందని, అందులో ఏ సింబల్‌పైన ఓటు వేశారో తనిఖీ చేసుకోవచ్చన్నారు. ఓటర్లకు ఈవీఎంలపై ఉన్న సందేహాలను తొలగించారు. అనంతరం అక్కడే ఈవీఎం ద్వారా నమూనా ఓటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ పవన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.